క్లుప్తంగా

చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స



రక్తమార్పిడి చికిత్స పొందుతున్న చిన్నారులు

ఏలూరు టౌన్ : ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో గురువారం తొమ్మిది మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ వె.ప్రసన్న కుమార్ ఆదేశాల మేరకు త్వరలోనే మండల స్థాయిలో రెడ్‌క్రాస్ కమిటీలను ఏర్పాటు చేస్తామని, సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని చెప్పారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులు, సహాయకులు 25 మందికి ఆంధ్రా బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ వేమా హరినారాయణ సహకారంలో భోజన సదుపాయం కల్పించారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ వరప్రసాదరావు, తదితరులు ఉన్నారు.

ఇద్దరు బాలలపై కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతిగృహంలో ఇద్దరు బాలలు కొట్టుకోవటంతో వారిపై కేసు నమోదయింది. పాలకొల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక కేసుకు సంబంధించి ఇద్దరు బాలలను సత్ప్రవర్తన నిమిత్తం ఏలూరు శనివారపుపేటలోని బాలుర వసతిగృహానికి పంపారు. వారిద్దరూ ఈనెల 1న ఒకరినొకరు కొట్టుకోవటంతో ఒక బాలుడి ముక్కు భాగం దెబ్బతినటంతో హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఈ కొట్లాటపై బాలుర వసతిగృహం సూపరింటెండెంట్ మురళీధర్ ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కేవీ వరప్రసాద్ ఆదేశాలతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ టి.శశిధర్ పేరన్నొన్నారు. తంగెళ్లమూడి సెక్షన్ పరిధిలోని ఖండ్రికగూడెం, ఆర్‌టీఓ కార్యాలయం, ఎఫ్‌సీఐ గోడౌన్, బాలాజీ నగర్, తాపీమేస్త్రి కాలనీ టైటస్ నగర్, రాజరాజేశ్వరి నగర్, సాయి నగర్, కుమ్మరి రేవు, పుష్పలీలా నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు. **నార్త్ సెక్షన్ పరిధిలో..** అశోక్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని అశోక్ నగర్, రామచంద్రరావు పేట, విజయవిహార్ సెంటర్, రమా మహల్ సెంటర్, పోలీస్ క్వార్టర్స్, కలెక్టరేట్ కాంపౌండ్, కలెక్టర్ కార్యాలయం వెనుక రోడ్డు, ఏటిగట్టు, కొత్త బస్టాండ్ సెంటర్, పత్తేబాద, ఫైర్ స్టేషన్ సెంటర్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బాబూజగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకం

ఏలూరు టౌన్: స్వాతంత్య్ర సమరయోధుడు, సంఘ సంస్కర్త డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 37వ వర్ధంతి కార్యక్రమం వైఎస్సార్‌సీపీ స్థానిక జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్ మాట్లాడుతూ భారతదేశ ఉపప్రధానిగా, సంఘ సంస్కర్తగా దళిత, బలహీనవర్గాల హక్కులు, అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన భారత రాజ్యాంగాన్ని ఖచ్చితంగా అమలు చేసిన మహోన్నత నాయకుడు జగ్జీవన్‌రామ్ అని అన్నారు. ఏలూరు నగర డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు మాట్లాడుతూ రైల్వే, వ్యవసాయ, రక్షణ, కార్మిక శాఖల్లో సంస్కరణలకు నాందిపలికిన గొప్ప ఆదర్శమూర్తి జగ్జీవన్‌రామ్ అన్నారు. ఎస్సీ జాతీయ నాయకులు పాలిమేర హరికృష్ణ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు దిరిశాల వరప్రసాద్, కార్పొరేటర్ పాలిమేర దాసు, లిడ్క్యాప్ డైరెక్టర్ సాంగా సందీప్, ఏఎంసీ డైరెక్టర్ మేతర సురేష్, నాయకులు పాలడుగు మురళీశ్యామ్, గూడూరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో నివాళులు

చరిత్రలో కొత్త ఒరవడికి నాంది

ఏలూరు (టూటౌన్): భారతదేశ చరిత్రలో కొత్త ఒరవడి సృష్టించిన సమతావాది డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ అని వక్తలు కొనియాడారు. స్థానిక ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ సొసైటీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరుణోదయ విద్యాసంస్థ చైర్మన్ డోమినిక్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మేతర అజయ్‌బాబు మాట్లాడుతూ దేశానికి ఎనలేని సేవలు అందించిన గొప్ప నాయకుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు మహేంద్ర, నాగబాబు, బొద్దుల వేణు, జగపతి బాబు మనోహర స్వామి, చొటపల్లి శ్రీనివాసరావు, మేతర నాగరాజు, శాంతి, కరుణ, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దళిత జనోద్ధారకుడు

49 డివిజన్ కబాడీగూడెం ప్రాంతంలో జాతీయ ఎస్సీ నాయకులు పాలిమేర హరికృష్ణ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ దళిత జనోద్ధారకుడని హరికృష్ణ కొనియాడారు. కబాడీగూడెంలో జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నేటికి 20 సంవత్సరాలు పూర్తయిందన్నారు. స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద పలువురు నాయకులు నివాళులర్పించారు.

దళిత సేన రాష్ట్ర కార్యాలయంలో..

ఆర్ఆర్‌పేటలోని దళితసేన రాష్ట్ర కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి పౌరుడు నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో దళిత సేన రాష్ట్ర కార్యదర్శి షేక్ సయ్యద్ బాజీ, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుంటూరు నవీన్ కుమార్, రావూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



49వ డివిజన్ కబాడీగూడెంలో నివాళులర్పిస్తున్న హరికృష్ణ



దళిత సేన రాష్ట్ర కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

సీఎం జగన్‌కు అండగా ఉందాం





జగనన్న సురక్ష శిబిరంలో సర్టిఫికెట్ అందిస్తున్న కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, కమిషనర్ వెంకటకృష్ణ, కార్పొరేటర్లు, జగనన్న సురక్ష శిబిరం వద్ద సర్టిఫికెట్ల కోలాహలం

- కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు
- మూడో రోజు 2327 మందికి సర్టిఫికెట్ల పంపిణీ

ఏలూరు టౌన్: పేదల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తోన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు కోరారు. ఏలూరు నగరంలో మూడోరోజు గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం వేడుకలా కొనసాగింది. తాపీమేస్త్రి కాలనీ 1, 2, చొదిమెళ్ల, తంగెళ్లమూడి 1, 2 సచివాలయాల పరిధిలో ప్రజలకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం ఏలూరు కండ్రికగూడెంలోని సుఖీభవ కల్యాణ మండపంలో నిర్వహించారు. 2,327 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. ఈ క్లస్టర్ పరిధిలో 2,584 మంది దరఖాస్తు చేసుకోగా.. కుల ధ్రువ పత్రాలు 1,298 మందికి, ఆదాయ ధ్రువ పత్రాలు 400 మందికి అందజేశారు. 572 మందికి ఆధార్ అప్‌డేట్, 57 మందికి రైస్ కార్డు, మార్పులు, చేర్పుల చేశారు. ఇంకా 257 దరఖాస్తులు పరిశీలించాల్సి ఉంది. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ తమది పేదల పక్షపాత ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బత్తిన విజయకుమార్, అద్దంకి హరిబాబు, పండూరి భవాని, దేవరకొండ శ్రీనివాస్, తంగిరాల అరుణ, డిప్యూటీ కమిషనర్ ఎస్.రాధ, పార్టీ నాయకులు సన్నీ చైతన్య తదితరులు ఉన్నారు.

జగనన్నతోనే సాధ్యం



పేదలకు న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నతోనే సాధ్యం. ఆయన వచ్చాకనే మాలాంటి పేదలకు అన్నీ సక్రమంగా అందుతున్నాయి. గతంలో ఇలా ఇంట్లో వాళ్లకు ఏవైనా సర్టిఫికెట్ కావాలంటే తిరిగి తిరిగి కాళ్లు అరిగేవి తప్ప, పనులు అయ్యేవి కాదు. ఈ రోజు వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, నాయకులు ఇంటికే వచ్చి మాకు కావాల్సిన సర్టిఫికెట్లు అన్నీ ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– బత్తుల శ్రీను, కండ్రికగూడెం, ఏలూరు

సీఎం విధానం నచ్చింది



స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే సందర్భంలో కుల, ఆదాయం, పుట్టినరోజు వంటి సర్టిఫికెట్లు కావాలంటే ఇంట్లో పెద్దలు పనులు మానుకుని మరీ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అర్జెంట్‌గా సర్టిఫికెట్ కావాలంటే అయ్యేది కాదు. చాలా బాధలు పడేవాళ్లం. కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలనలో ఉచితంగా ఇంటివద్దకే వచ్చి దరఖాస్తు చేసి సర్టిఫికెట్లు ఇవ్వటం చాలా బాగుంది. ఈ విధానం నచ్చింది.

– బి.సుందరకుమార్, విద్యార్థి, ఏలూరు

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు



ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, నాటుసారా నిర్మూలనకు మరింత కఠిన వైఖరి అవలంభిస్తామని ఏలూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ఎస్పీ డి.మేరీప్రశాంతి ఆదేశాలతో ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏలూరు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, పోలవరం, కైకలూరు, నూజివీడు ఎస్ఈబీ సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, పోలీస్ అధికారులతో గురువారం ఆయన నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. గంజాయి రవాణా, విక్రయాల నిరోధానికి తీసుకుంటోన్న చర్యలు, కేసులు, ప్రగతిపై ఆరా తీశారు. జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టేందుకు నిత్యం వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. చట్టాల పట్ల, శిక్షలు పడతాయనే భయం నిందితులకు అవగాహన రావాలన్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే నాటుసారాను అరికట్టాలని చెప్పారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగులు, పేకాట, కోడిపందాలు వంటి జూదాలపై నిఘా ఉంచుతూ నిత్యం దాడులు చేయాలన్నారు. విద్యార్థులకు గంజాయి వినియోగంతో కలిగే అనర్థాలను వివరించాలని ఆదేశించారు. భీమడోలు ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో ఒక కారులో రూ.56,700 విలువైన 934 పాండిచ్చేరి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసిన ఎస్ఈబీ సీఐ ఏయూబీ సుబ్రహ్మణ్యం, హెచ్‌సీ బి.సీతారామయ్యలకు ప్రశంసాపత్రం అందించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమీక్షలో ఎస్ఈబీ సూపరింటెండెంట్ అరుణకుమారి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ అమరబాబు, ఎస్ఈబీ సీఐ ప్రసాద్‌కుమార్, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఏలూరు సీఐ శ్రీనివాసరెడ్డి, సీఐ ధనరాజ్, తదితరులు ఉన్నారు.

400 శునకాలకు ఉచిత వ్యాక్సిన్



యాంటీ రాబీస్ వ్యాక్సిన్ వేస్తున్న డిడి డాక్టర్ ఎ.రామచంద్రరావు

ఏలూరు (టూటౌన్): జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల జంతు ప్రేమికులు, పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థక శాఖ డీడీ ఎ.రామచంద్రరావు అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవంను పురస్కరించుకుని స్థానిక ప్రాంతీయ పశువైద్య శాలలో గురువారం 400 శునకాలకు ఉచితంగా యాంటీ రాబీస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ జూనోసిస్ వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవాలని జంతు ప్రేమికులకు సూచించారు. శుక్రవారం కూడా వ్యాక్సిన్ వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ సహాయ సంచాలకులు ఎ.సుచరిత, సహాయ సంచాలకులు పి.సుబ్రహ్మణ్యం, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఎం.లక్ష్మి, పి.రంగనాథ్, ఎ.సుందర్ సింగ్, ఎస్‌వీఎస్ విజయశ్రీ, ప్రాంతీయపశువైద్యశాల సిబ్బంది, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పీఆర్‌టీయూ జిల్లా సమావేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 8న ఉదయం 10 గంటలకు స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో ప్రారంభమవుతుందని ఆ సంఘ ఏలూరు జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సుబ్బారావు తెలిపారు.

గడపగడపకూ ప్రభుత్వ సేవలు



ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాము, సచివాలయ ఉద్యోగులు

ఏలూరు రూరల్: ప్రభుత్వ సేవలు గడపగడపకు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. జగనన్న సురక్షలో భాగంగా గురువారం 15వ డివిజన్‌లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. గతంలో ప్రభుత్వ సేవలు పొందాలంటే నగర కార్పొరేషన్ చుట్టూ తిరగాలన్నారు. ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిస్థితి పూర్తిగా మార్చేశారని చెప్పారు. ఇంటి వద్దకే సేవలు అందుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు తమకు అవసరమైన ధ్రువపత్రాల కోసం అర్జీలు అందజేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	98	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07-10
బెండకాయలు	36	కంద	40
పచ్చిమిర్చి	80-88	బీట్‌రూట్	40
కాకర కాయలు	64	కీరా దోస	64
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	50	అల్లం	250
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	42	పాలకూర	12
దొండకాయలు	36	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	24-28	బఠాణీ	--
అనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	16
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	32
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	27

చిన్నారుల వైద్యసేవల్లో అప్రమత్తత అవసరం



బ్లాసమ్స్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : చిన్నారులకు అందించే వైద్య సేవల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ సూచించారు. గురువారం స్థానిక శంకర మఠం రోడ్డులో ఏర్పాటు చేసిన బ్లాసమ్స్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిన్న అనారోగ్యమైనా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో చిన్నారులకు చికిత్స అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆసుపత్రి వైద్యులు సందీప్, నంద కిషోర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు పూర్తిస్థాయి ఐసీయూ వైద్య సేవలు ఏలూరులో కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. తమ సంస్థ విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, జగ్గయ్యపేటల్లో చిన్నారులకు వైద్య సేవలు అందిస్తోందని తెలిపారు. తమ ఆసుపత్రిలో 24/7 ఎమర్జెన్సీ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, డాక్టర్లు ప్రసాద్, సాంబశివరావు, రవీంద్రనాథ్, బ్లాసమ్స్ హాస్పిటల్ వైద్యులు జె.మానస, శ్రీనివాస కిషోర్, అశోక్, హిమబిందు, సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు భజంత్రీ శ్రీనివాసరావు కోరారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు యలగాడ దుర్గారావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరు కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులకు యూనిఫాం కుట్టుకూలి విడుదల చేయలని, సరెండర్ లీవ్ నగదును చెల్లించాలని, విలీన పంచాయతీల కార్మికులకు జూన్ నెల జీతం బకాయి చెల్లించాలని, 3 నెలల హెల్త్ అలవెన్స్‌లు ఇవ్వాల్సి కోరారు.

గొర్రెలు, మేకల పెంపకందార్ల సమస్యలపై వినతి



ప్రకాశం యాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న జిల్లా నాయకులు

ఏలూరు (టూటౌన్): గొర్రెలు, మేకల పెంపకందార్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని సంఘం రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ జి.ప్రకాశం యాదవ్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో జిల్లా నాయకులు గురువారం సాయంత్రం ఆయన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. మేకలు, గొర్రెలు మేపుకోవడానికి ప్రతి మండలంలో ఉన్న బంజర భూములను కేటాయించాలని, అడవుల్లో తిరిగే గొర్రెల కాపర్లకు పెన్షన్ అందించాలని, యాక్సిడెంట్లు, పిడుగుపాట్లు వల్ల మరణించిన గొర్రెల కాపరులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, గొర్రెలు, మేకల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మానసిక ఒత్తిళ్లను అధిగమించాలని సైకియాట్రిక్ సోషల్ వర్కర్ ఎల్.తిరుపతి స్వామి విద్యార్థులకు సూచించారు. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మానసిక వ్యాధులపై స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో తరచూ వచ్చే మానసిక వ్యాధి, ఒత్తిడి వంటి లక్షణాలను వివరించారు. తల తిరగడం, గుండెదడ, చేతులు, కాళ్లు చల్లబడడం, ఊపిరి ఆడకపోవడం, అధిక రక్తపోటు, తలనొప్పి, నిద్రలేమి వంటి లక్షణాలు ఉంటే వెంటనే మానసిక వైద్య నిపుణులను సంప్రదించి కౌన్సెలింగ్, చికిత్స తీసుకోవాలని సూచించారు. యోగా, వ్యాయామం, ధ్యానం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం, జీవన శైలిలో మార్పులు తీసుకురావడం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గుబ్బల వెంకట శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గుడివాకలంకలో జగనన్న సురక్ష

ఏలూరు రూరల్: ఏలూరు మండలం గుడివాకలంకలోని సీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల ప్రత్యేక అధికారి ఏఎస్‌వీఎస్ మూర్తి తెలిపారు. సాయంత్రం 4 గంటల వరకు అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించి, పలు రకాల ధ్రువపత్రాలు మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు.